# అనుకున్నంత తేలిక కాదు నాటకాలు ప్రదర్శించడం

**డాక్టర్ మొదలి నాగభూషణ శర్మ**

ఉస్మానియా విశ్వవిద్యాలయం

నాటక విభాగం అధ్యక్షులు, ఆచార్యులు

ఓ రంగస్థలం ఎక్కి మెరిసిపోతున్న విద్యుద్దీపాల వెలుగుల్లో మొహాలకి రంగుపూసుకుని తాను కాని మరో వ్యక్తిగా నలుగుర్నీ నమ్మించడం తేలికైన పనికాదు. ఒకప్పుడు – జీవితంలో నాటకాలు ఎక్కువగా లేనిరోజుల్లో – నాటకాలు ఆడ్డం తేలిగ్గా ఉండేదేమో గాని, జీవితంలో ప్రతి నిత్యమూ, ప్రతి రంగంలోనూ ఆడే నాటకాలు వృత్తులుగా ఎదిగిపోవడంతో – నాటకం మరీ మూలమూలలకి ఒదిగిపోతోంది. ఈ మధ్య, మన రాష్ట్రంలో మరీనూ.

నాటకాలాడ్డం అంత కష్టమా ఏమిటండీ? – అని మీరడగొచ్చు. కష్టమే మరి. నిత్యజీవితంలో ధాటీగా మాట్లాడి, పెద్ద పెద్ద వ్యవహారాలు నడిపే రామప్పంతులొకాయన రామప్పంతులు వేషం వేసి నలుగురూ చూస్తున్నారని గ్రహించి, బెంబేలు పడిపోయి మధురవాణిని చూసి "పిల్లా! అగ్గిపుల్ల!" అనడానికి బదులు "పుల్లా! అగ్గిపిల్ల!" అనడం ఎందుకు జరిగిందంటారు? ఇదంతా మాట్లాడుకుంటూ పోతున్న నటుల మీద కిమ్మనకుండా కూర్చున్న ప్రేక్షకుల ప్రభావమేగా?

నిజానికి – ఈ ప్రేక్షకులు – ఎంతటి నటుడి ధైర్యాన్నయినా నీళ్ళు కార్చేయగల అవ్వాయి చువ్వలు అనుకోండి. అయితే ఈ అవ్వాయి చువ్వలు నాటక ప్రదర్శనలో ఆఖరి పేలుడు పదార్థం మాత్రమే! అంతకంటే ముందు చాలా రకాల బాణసంచా కాల్పులుంటాయి. ఈ అవస్థ పూలపొట్లాలు తిప్పడంతో మొదలవుతుంది. ఆ తరువాత తాటాకు టపాకాయలు, కాకర పువ్వొత్తులు, జిల్లీలు, మతాబులు, చిచ్చుబుడ్లు – ఇవన్నీ ఒకదాని తరువాత మరొకటి కవ్వించి సమ్మోహితుల్ని చేస్తాయి. నాటక ప్రదర్శనల్ని దీపావళి ముచ్చటల్ని చేస్తాయి. చీకట్లో వెలిగే ప్రతిమతాబూ అనకున్నట్టుగానే ప్రతి నటుడూ కూడా తన నాటకం, తన నటన చుట్టు ఉన్న చీకట్లని ఛేదించుకుంటూ ప్రకాశమానం అవుతున్నదనుకునేవాడే!

నాటక మంటే నలుగురు కలిసి నలుగురి ఆనందం కోసం చేసే పని కనక – సమిష్టిగా జరపవలసిన కార్యక్రమం కనుక – నటుల మధ్య మనస్తాపాలు – గుండెల మంటలు (heart burnings) తప్పవు. మనలో క్రమశిక్షణలో ఒద్దికగా నడిచే followers కన్నా, నాయకత్వం వహిద్దామనుకునే, నాయకులే ఎక్కువ కనుక – అటువంటి ప్రతివాడూ తన చుట్టూ నలుగుర్ని చేర్చుకుని వేరే సమాజం పెట్టి నాటకాలాడ్డం మనకు నిత్యం అనుభవమే కదూ!

ఏతావాతా – నాటకావస్థ పూలపొట్లాలు తిప్పడంతో మొదలౌతుందన్నాను. ఈ తరం కుర్రకారుకు అలవాటు లేదు కాని మా రోజల్లో మా పెద్దవాళ్ళు టపాకాయలు కాల్చాలని ఊ ఆరాటపడిపోయే మా చేతుల్లో

ఈ పూల పొట్లాలు పెట్టి ఇహ వీడిరోగం కుదిరిందిలే – అని నవ్వుకునేవాళ్ళని నా అనుమానం. చేతులు నొప్పిపుట్టేటట్టు ఎంతైనా తిప్పండి – పూలు రాలవే – ఈనాటి మన నాటకాలలాగా – నాటకం ఎన్నుకోవడం, అందులోనూ జనాన్ని ఆకట్టుకునే పువ్వుల్లాంగి దృశ్యాల్ని రాల్చడం – నిజంగా పూలపొట్లాట తంతే! ముఖ్య పాత్రధారి తన పాత్రని మాత్రం చూసుకుని నాటకాన్ని ఎన్నుకుని దాన్ని ఏకపాత్రాభినయం చెయ్యడం, పదిమందితో నాటకం ఆడాలని ఉబలాటపడే వాళ్లని రంగస్థలంమీద కసరత్తులు చేయించడం వగైరాలన్నీ రకరాల పూలురాలని పూలపొట్లాలే!

ఇక నటుల్ని ఎన్నుకోవడం! ఇది ప్రతివాళ్ళకీ కాకరపువ్వొత్తులు కాల్చడం అంత తేలిక అని అభిప్రాయం. తీరా ముగ్గులోకి దిగాక అన్నీ అవాంతరాలే! మెడమీద తల ఉన్న ప్రతివాడికీ హీరో వేషమే కావాలి! మరీ బక్కగా ఉన్నవాడు – "ప్చ్! విలన్ వేషంతో సరిపెట్టుకుంటాలే!" అంటాడు. వీళ్ళందర్నీ ఒకచోట చేరి&చ వారి వారి ఎతత్తు, పొడుగు, వెడల్పు, ఉరుమూ – వీటిని బట్టి పాత్రల్ని పంచుకుందామన్నా ప్రమాదమే! తీరా పాత్రల్ని ఇచ్చాక చూస్తే – బొంగురుగొంతు కీచకులూ, మగగొంతు మధురవాణులూ తారసపడ్డం మనకు కొత్తకాదుగదా!

'పాండవోద్యోగం'లో పాండవులు కృష్ణుణ్ణి సంధి చేసుకురమ్మని పంపించే ఘట్టంలో ముందు ధర్మరాజు, తన సంధి పద్యాలు పాడింతర్వాత కృష్ణుడు కోపంగా ఉన్న భీముణ్ణి చూసి – "ఐనను బోయిరావలెను హస్తినకు..." అని తాను కూడా అదే పాట పాడతాడు. అప్పుడు కోపం వచ్చిన భీముడు – ఇంత మనషీ లేచి – ఓయీ కురుపాండవ సంధి విధాన ధౌరేయి! పాండవ దూతా! జనార్ధనా! అని కీచుగొంతుతో అరిచుటప్పటికి ప్రేక్షకులు విరగబడి నవ్వడం, నాటకం భ్రష్టు పట్టిపోవడం ఎన్నిసార్లు జరిగిందో! ఇటువంటి ఎన్ని దెబ్బలు తింటేనే సరైన నటులు – శరీరంలో శారీరంలో కూడా – సరైన పాత్రల్ని ధరించడంలో ఉన్న ఔచిత్యాన్ని గుర్తించగలగడం! చిన్న వేషాలు వేసినంత మాత్రాన చిన్ననటులైపోరు.

ఇహ స్త్రీ పాత్రల్ని స్త్రీలే ధరించాలి అన్న నినాదం వచ్చాక – అది అనవాయితీ అయి కూర్చున్నాక చూడండి నాటకాల వాళ్ళ పాట్లు! అసలు ఆడవేషాలు వేసే నాటకాల వాళ్ళే తక్కువ! కొంచెం మంచినటి అయితే ఇంక పట్టలేం. Star system అనుకోండి. తీరా ఆవిడకి నాటకంలో పాత్ర ఇచ్చాక – ఇహ అడక్కండి....

మనకి స్త్రీ పాత్రలు లేని నాటకాలు రావడానికి ఇదే గదండీ కారణం! ఒక ఆంగ్ల నాటిక అనే వస్తువుని తెలుగు పొయ్యి మీద వండి తెలుగు నాటకి అనే ముడివస్తువును తయారు చెయ్యాలనుకోండి – ఆ ఇంగ్లీషు వాళ్లకి నటీమణులు దొరకడం కష్టం కాదు కనుక. తెలుగులో వాళ్లని వర్గవిభజన చేసి మగవాళ్ళని చేసేస్తాం. ఇంగ్లీషులో maid servant ఉండడం పరిపాటి. తెలుగులో ఆవిడ స్థానంలో ఓ నౌకరు ప్రత్యక్షం...."రామయ్యా!" అంటే..."ఏమయ్యా!" అంటూ – మధ్యతరగతి ఇంట్లో సోఫాలు దులుపుతూన్న నౌకరుతో నాటకం ప్రారంభం!!

ఇట్లా ఆడనటులు ఉంటే ఒక బాధ, లేకపోతే మరో బాధకదా, పోనీ వెనకటి మాదిరిగా ఎంచక్కా

ఆడవేషాలు మగవాళ్ళే వేస్తోనో – అని సలహా చెప్పాడు ఓ నాటక సలహాదారు. అందులోనూ మనకు స్థానం, ముప్పిడి జగ్గరాజు వంటి వాళ్ళు ఏ నటికీ తగ్గని నటులున్నారు కదా! కాని తీరా చూస్తే ఆ కాలంలో కూడా ఈ ఆడవేషాలు వేసే మగనటులు ధాటికీ గొప్ప నటులు కూడా కిందా మీదా అయ్యేవాళ్ళని వినికిడి. వాళ్ళ హోషులకి గుమ్మయి పోయి జమీందార్లు తమ తమ జమీలే తాకట్టు పెట్టిన సంఘటనలున్నాయిని తార్కాణం. ఈ కథలు ఎంతవరకు నిజమే తెలియదు కాని బొత్తిగా హాలుక్కూడా డబ్బు కట్టలేని నాటకాల వాళ్ళని అటువంటి ప్రమాదాల నించి మాత్రం తప్పించింది – ఆడవాళ్ళే ఆడవేషాలు వేయ్యాలనే నియమం.

నాటకమూ ఎన్నుకుని, నటీనటుల్ని ఎన్నుకున్నా మనుకోండి. అంతటితో తెరిపిన పడ్డట్టు కాదు. వీళ్ళకి రిహార్సులు చేయించడం ఎక్కడ? కంట్రాక్టు నాటకాలే నయం! ఎంచక్కా రిహార్సలు అవసరం ఉండేది కాదు. ఒక నటుడు విజయనగరం నుంచి, మరొకయాన తెనాలినుంచి, మరొకరు నెల్లూరు నుంచి వచ్చి జగ్గయ్యపేటలో కలిసి కలిసిన గంటలో నాటకం తెర ఎత్తగలగడం తెలుగు వ్యాపారస్తులు తెలుగు నాటక కళకి పెట్టిన భిక్ష. ఇహ తీ రోజుల్లో వెతుకుతున్నా హాలు దొరకదు రిహార్సలుకి. మనకి నాటకాలు వెయ్యడానికే హాళ్ళు లేవు. ఇహ రిహార్సలు సంగతి పట్టించుకునేదెవరు? చివరకి హీరో వేషం వేసేవాడియిల్లో, డైరక్టరు గారి ఇల్లో, యిహ ఏమీ దొరక్కపోతే హీరోయిన్‌గారి ఇల్లో గతి అవుతుంది. నాలుగు రోజులు వీళ్ళ అరుపులూ, కేకలూ విన్నాక చుట్టు పక్కల వాళ్లు న్యూసెన్సు కేసు పెడతామని బెదిరించడం, అధవా ఆయిల్లు స్వంత ఇల్లు కాక, అద్దె ఇల్లు అయితే ఇంటివాళ్ళు వెంటనే ఖాళీ చెయ్యమని గదమాయించడం అందరూ నాటకాల వాళ్ళకీ స్వానుభవమే! పట్టణాల్లో ఈ బాధమరీ ఎక్కువ! ఎక్కడో 3, 4 మైళ్ళ దూరాన రిహార్సలు చేసి చచ్చీ చెడీ వస్తు నిద్రమత్తులో లేచిన అర్థాంగి అరగంట అయ్యాక విసుక్కుంటూ తలుపు తియ్యడం, ఇల్లు పట్టక తిరుగుతున్నాడన్న పెద్దవాళ్ళ అక్షింతలు – ఇహ ఛస్తే బాగుపడడన్న ముసలివాళ్ళ దీవనలు – ఇవి అన్నీ దిగమింగిన వాళ్ళే కదండీ అసలు నటులు! హాలాహలం తాగిన శివుడు నాటకాలకి అధిపతి కావడంలో ఇదే కదండీ అంతరార్థం!

రామ జోగేశ్వరరావుగారు ఏలూరులో పెద్దనటుడు. భమిడిపాటి వారి నాటకాలు ఆడ్డంలో దిట్ట. ఆయన ఒకసారి కె.వెంకటేశ్వరరావు గారిని ఓ నాటకంలో వేషం వెయ్యమని ఏలూరు పిలిచాడు. కాఫీగట్రా అయ్యాక – రామజోగేశ్వరావుగారు ఓ రిక్షావాడ్ని బాడుగకి పిలిచాడు. "ఎక్కడికండీ?" అన్నాడు రిక్షావాడు. "మమ్మల్ని ఈ వూరు నాలుగు మూలలకీ తిప్పు. పొద్దుట్నుంచీ సాయంత్రాదాకా బేరం" అన్నాడాయన. వెంకటేశ్వరరావుగారు బిత్తరపోయాడు. ఈ వేషం కొత్త వేషం రిహార్సలు వేసుకోవాలని పొద్దున్నే రమ్మన్న పెద్దమనిషి ఏలూరు ఊరేగింపు ప్రోగ్రాం ఎందుకు పెట్టాడో అర్థం కాలేదు. "మరి రిహార్సలు?" అంటూ నసిగాడు వెంకటేశ్వరావుగారు. "ఎక్కవయ్యా! ఈ రిక్షాలోనే మన రిహార్సలు. ఇంతకన్నా పదిలమైన స్థలం ఎక్కడుందీ?.....పదవోయ్." అంటూ పెద్ద పెట్టున నవ్వాట్ట రామజోగేశ్వరావుగారు.

కాలవగట్లు, రైలు కట్టలు, పార్కులు, చీట్ల పేక ఆడి ఆటగాళ్ళు లేచిపోయిన పాకలు – ఒకటా! ఎక్కడెక్కడ చెయ్యరండీ రిహార్సలు? ఇదంతా నవ్వులాట అనుకునేరు! పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకటం అన్నట్టు – వినేవాళ్ళకి నవ్వులాటగా ఉన్నా, నాటకాల వాళ్ళకి మాత్రం ఇది పుండు సలిపే సలపరింత లాంటిదే!

అయ్యా నాటకం అంటే ఉండుకున్న బులబాటం కొద్దీ – ఇన్ని కష్టాలుపడి నాటక ప్రదర్శనకి తయారవుతూ వుంటామా – ఇంకా నాటకం మూడు నాలుగు రోజులుందనగా – ఏ తాతయ్య పోయాడనో, మామ్మ మంచం పట్టిందనో, బావమరిది ఇంట్లో గృహప్రవేశమనో – నటుడు తప్పని సరిగా గైర్హాజరు కావలసిన సందర్భాలు తారస పడడం మామూలే. ఏ పాశ్చాత్య నాటకాల్లోనో – నాటక జనం ఎక్కువగా ఉన్న చోట్ల understudy ఉండడం అలవాటు. మనకు అసలు నాటకానికే అద్దెకు తెచ్చుకునే చోట అది సాధ్యపడుతుందిగదా! అటువంటప్పుడు – అప్పటి దాకా ఆపద్ధర్మంగా ప్రాంప్టింగ్ చేస్తున్న వ్యక్తి రాత్రికి రాత్రి నటుడై పోవడం నా ఎరికలో ఎన్నిసార్లు జరిగిందో లెక్కలేదు.

అటువంటప్పుడు సందర్భమే మాకూ వచ్చింది ఈ మధ్య. "రాజా ఈడిపస్" – ప్రఖ్యాత గ్రీకు నాటకం వేస్తున్నాం – ప్రధాన పాత్రధారి – పాపం! చాలా మంచివాడు – నాటకం ఇంకా రెండుమూడు రోజులుందనగా తల తిరుగుతోందని complaint చేశాడు. తీరా రేపు నాటకం అనగా mild attach వచ్చింది. డాక్టర్లు ససేమిరా bed మీద నుంచి లేవడానికి వీలు లేదన్నారు. నాటక ప్రదర్శనకి ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. ఆ రాత్రి మాకు నిద్రలేదు. ఆఖరి నిముషంలో మరో actor మిత్రుణ్ణి తీసుకువచ్చి ఆరుగంటల్లో ఆ వేషం వేయించాం. మంచి actor కనుక మంచి మనిషి కనుక సమయానికి వెయ్యనూ వేశాడు, బాగానూ వేశాడు. నాటకం బ్రహ్మాండంగా ఉందని జనం అనుకున్నారు. కాని ఆ క్రితం రోజురాత్రి మా మనస్సుల్లో వేదన ఎందరికి తెలుసు?

నిజమైన జబ్బులు ఇట్లా బాధపెడతయ్యా, ఒక్కొక్కప్పుడు నాటకం జబ్బులు కూడా ప్రమాదాలకి దారితీస్తాయి……నాటకం వెయ్యడానికి వెళ్ళాలి causal leaves అన్నీ exhaust అయిపోయాయి. ఎవరికో కిందెట్టు మీదెట్టుగా ఉందనో, తమ్ముడి పెళ్ళి నిశ్చయం అయిందనో, ఎప్పుడో పోయిన అమ్మమ్మ hospitalize అయిందనో telegram తెప్పించి గుట్టు చప్పుడు కాకుండా నాటకం వేసిరావడం మామూలే! కాని అట్లా అమ్మమ్మని ఆస్పత్రిలో చేర్చారని officer నమ్మించి బందరు నుంచి గుంటూరు పోయి ఎదురీత – నాటకం వేస్తుంటే, ఆ officer గారు Chief guest గారి బావ మరిది హోదాలో నాటకం first rowలో ప్రత్యక్షం కావడం, అది చూసిన నటుడు ప్రేమ నటించవలసి వచ్చినా పాలిపోయి నత్తి మాటలు మాట్లాడడం – నా స్వానుభవం.

నటులు చెప్పకుండా గైర్హాజరు అయితే – ఆ రాత్రి నాటకం చెయ్యడానికి ఒప్పుకున్న పెద్ద మనిషికీ – నెప్పులొస్తూ కాన్పు కష్టం అని చెప్పిన ఇల్లాలికీ తేడా లేదనుకోండి……ఓ పేద్ద డైరెక్టరు ఆడే ఓ పేద్ద నాటకంలో కొన్నాళ్ళు ఇలాగే జరిగింది. నాటకం 15రోజులు వరసగా ఆడాలి. నటబాహుళ్యం వల్ల ప్రతిరోజు ప్రదర్శనకీ ఎవరో ఒకరు రావడానికి వీలు పడేది కాదు. ఇహ ఆయన వాకిట్లో నిలబడి ఆదారిన పోయే ప్రతి తెలిసిన వాడినీ "ఓ చిన్న వేషం ఉంది, వెయ్యండి" అని బతిమిలాడే స్థితికి వెళ్ళాడు. ఆ నాటకం ఆడినన్నాళ్ళు, తెలిసున్న వాళ్ళు ఆయన ఇంటి సందుకు వెళ్ళడానికి భయపడేవాళ్ళనుకోండి!

సాంస్కృతికత శాఖా సంచాలకులు
శ్రీ శ్రీకాంత్‌గారికి,

నమస్కారాలు.

మీరు 24-09-2003నాడు పంపిన ఉత్తరం (D.O.Lr. No. Doc/spl/2003), అందుతో జతచేసి పంపిన ప్రభుత్వ జీ.ఓ. నకలు - రెండూ అందాయి.

ప్రఖ్యాత కళాకారులతో జరిపిన చర్చల సందర్భంగా తీసుకున్న నిర్ణయాల మేరకు మీరు ఒక సలహామండలిని, ఒక సంపాద మండలిని, ఒక 'సబ్' కమిటీని నియమించారని తెలుసుకున్నాను. చాలా సంతోషం.

ఇటీవల మీ ఆధ్వర్యంలో కొంతమంది కళాకారులం పాల్గొన్న సభలో గౌరవనీయ సాంస్కృతిక శాఖా కార్యదర్శులు Cultural Policy సంగతి ప్రస్తావించారు. కాని ఆ చర్చలో ఆ విషయాన్ని గురించి చర్చ జరగలేదు; ఆ సభ దాని విషయమై ఆమోదమూ తెలుపలేదు. అయితే అది ప్రభుత్వ ప్రసక్తి కనుక నిరభ్యంతరంగా, మీరు కమిటీ వేయవచ్చును. అయితే, ఆనాడు ప్రధానంగా చర్చించిన సంగీత నాటక అకాడమీ పునఃస్థాపన విషయమై కార్యదర్శిగారు చాలా సుముఖంగా మాట్లాడారు. దరిమిలా దానిని గురించి మంత్రివర్యులు ఒక ప్రకటనే చేశారు. ఆ విషయమై మీరు పంపిన ఉత్తరాలలో ఎక్కడా ప్రస్తావనే కన్పించదు. ఇది మాకందరికీ విచార హేతువు.

ఈ 'సబ్' కమిటీ విషయంలో కూడా ఒక మాట. Cultural Policy కోసం ఒక 'సెమినార్' నిర్వహించడానికి గాను ఒక సబ్‌కమిటీని నియమించడం చాలా హాస్యాస్పదమైన విషయంగా నాకు అనిపిస్తున్నది. పైగా జాతీయ స్థాయిలోనే దీనిని గురించి పదిహేనేళ్ళుగా చర్చ జరుగుతున్నది. నేనందులో భాగస్వామిని కూడా. దీని వలన ప్రయోజనం లేదు, కాలహరణం తప్ప.

ఈ సబ్ కమిటీ అనవసరమని నేను భావించడం వల్ల, ఇంతకన్న ముఖ్యమైన విషయాల ప్రస్తావన మీ ఉత్తరాలలో లేనందువల్ల - కల్చరల్ పోలసీ నిర్ణయంచడాకి ఉత్తమ కళాకారులతో కూడిన ఒక సలహామండలిని ఇప్పుడు ప్రభుత్వం నియమించినందు వల్ల, మీరు ఇప్పుడు వేసిన యీ "Subcommittee to Decide Frame-workd of Seminar for Finalization of State Cultural Policy"లోని నా సభ్యత్వం నుంచి నేను విరమించుకుంటున్నాను.

మీ ఆదరానికి, కార్యదర్శిగారి సద్భావనకు కృతజ్ఞతలతో.........

మీ......